అధ్వాన పాలనకు అడుగంటిన నీళ్లే సాక్ష్యం

- కాంగ్రెస్ సర్కారు వైఫల్యంతో నీటి సంక్షోభం
- 14 నెలల్లోనే భూగర్భ జల వ్యవస్థ అస్తవ్యస్తం
- భూగర్భ జలాలు 2 మీ.పైగా తగ్గడం దారుణం
- ప్రజలు మళ్లీ బోర్లపైనే ఆధారపడాల్సిన దుస్థితి
- ఎక్స్ వేదికగా మాజీ మంత్రి హరీశ్ ఆందోళన

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అధ్వాన పాలనకు రాష్ట్రంలో అడుగంటుతున్న జలాలే సంకేతాలని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి ముందుచూపులేమి, వైఫల్యంతో నీటి సంక్షోభం దిశగా తెలంగాణ వెళ్తున్నదని, రాష్ట్రవ్యాప్తంగా భూగర్భజలాలు గణనీయంగా తగ్గిపోయాయని శనివారం ఎక్స్‌వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. భూగర్భజలాల సంరక్షణలో తెలంగాణను గత బీఆర్ఎస్ ప్రభుత్వ ఆదర్శంగా నిలిపిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో నీటి ప్రణాళికలు పూర్తిగా వైఫల్యానికి గురవుతున్నాయని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో పదేండ్లలో భూగర్భజలాలు 56 శాతం పెరిగాయని వివరించారు. మిషన్ కాకతీయ ద్వారా 27,000కు పైగా చెరువులను పునరుద్ధరించడంతో 15 లక్షల ఎకరాలకు సాగునీరు అంది, 8.93 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం పెరిగిందని తెలిపారు. రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడి, భూగర్భజలాల నిల్వ స్థిరంగా ఉండి, తాగునీటి భద్రత కూడా బలపడిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ 14 నెలల పాలనలో భూగర్భ జలాల వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతో రెండు మీటర్లకు పైగా భూగర్భ జలాలు పడిపోయాయని, యాదాద్రి, భువనగిరిలో 2.71 మీటర్ల భారీ తగ్గుదల నమోదు కాగా, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఇతర జిల్లాల్లోనూ భూగర్భజలాల స్థాయి తీవ్రంగా పడిపోయిందని ఉదహరించారు. '120 కిలో మీటర్ల పొడవునా గోదావరి పూర్తిగా ఎండిపోతున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణ వైఫల్యం కారణంగా గోదావరిలో నీటి ప్రవాహం తగ్గిపోయింది. మేడిగడ్డ బరాజ్ సహా ప్రాజెక్టు నీటి భద్రతను నిలబెట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది' అని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు తాగునీటిని అందించిన మిషన్ భగీరథ పథకం ఇప్పుడు పూర్తిగా కుంటుపడిందని, ప్రజలు మళ్లీ బోర్లపైనే ఆధారపడాల్సిన దుస్థితి నెలకొన్నదని వాపోయారు.తాగునీటి కోసం ఎక్కువ మోటర్లు నడిపించుకోవాల్సి రావడం వల్ల కరెంట్ బిల్లులు పెరిగి ప్రజలపై ఆర్థిక భారం పెరుగుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. బలమైన నీటిపారుదల వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పతనం చేస్తున్నదని విమర్శించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోతున్నాయని, ప్రభుత్వం తక్షణమే స్పందించి నీటి పరిరక్షణ చర్యలు తీసుకోకపోతే రాబోయే రోజుల్లో రాష్ట్రం మరింత తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్ హెచ్చరిక.. సర్కారులో కదలిక

మొదటిపేజీ తరువాయి...

బసవేశ్వర ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిలిపివేసింది. ఇటీవల జహీరాబాద్ ప్రాంత రైతులతో సమావేశమైన కేసీఆర్ సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను నిలిపివేయడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సంగారెడ్డి జిల్లాను సస్యశ్యామలం చేసే సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులు పూర్తి చేసేంత వరకు బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో సంగారెడ్డి జిల్లా రైతాంగం, బీఆర్ఎస్ శ్రేణులు పోరాటం చేసేందుకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో హరీశ్‌రావు సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు ప్రారంభం కోసం సాగుపోరు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. హరీశ్‌రావు శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సంగారెడ్డి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాల పనులను తిరిగి ప్రారంభించేందుకు నారాయణఖేడ్, జహీరాబాద్ కేంద్రంగా రైతులు, ప్రజలతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టుల ఆయకట్టు పరిధిలో నిరసన కార్యక్రమాలు, బహిరంగసభల నిర్వహణకు కార్యాచరణ సిద్ధం చేశారు. ఈ నెల 24 నుంచి సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలపై సాగుపోరు ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో నిలిపివేసిన బసవేశ్వర ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను ప్రభుత్వం శనివారం తిరిగి ప్రారంభించింది. బోరంచలో పంప్‌హౌస్ నిర్మాణం కోసం 12 ఎకరాల్లో తవ్వకం పనులు మొదలయ్యాయి. హిటాచీలు, బుల్డోజర్లతో మట్టి తవ్వకం పనులు ముమ్మరం చేసింది. పంప్‌హౌస్ నిర్మాణం కోసం 20 మీటర్ల లోతులో మట్టి తవ్వకాలు జరుపుతున్నట్టు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. మట్టి తవ్వకం పనులు పూర్తి కాగానే పంప్‌హౌస్ నిర్మాణం పనులు మొదలు పెడతామని చెప్పారు. మరోవైపు, సంగమేశ్వర ఎత్తిపోతల పనులను కూడా తిరిగి ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. భూసేకరణకు ఉన్న అడ్డంకులు తొలగేలా చర్యలు చేపట్టడంతోపాటు వెంటనే నిర్మాణం పనులు ప్రారంభించాల్సిందిగా జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు సంగమేశ్వర ప్రాజెక్టు నిర్మాణం పనులు ప్రారంభించేందుకు అడుగులు వేస్తున్నారు. బీఆర్ఎస్ పోరువల్లే సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల ప్రాజెక్టుల పనులు తిరిగి మొదలయ్యాయని రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కేసీఆర్ ప్రారంభించిన సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను పూర్తి చేసి సాగునీరు ఇవ్వాలని సంగారెడ్డి జిల్లా రైతాంగం కోరుకుంటున్నది. తమ పక్షాన పోరుకు సిద్ధమైన కేసీఆర్, హరీశ్‌రావు, బీఆర్ఎస్ శ్రేణులకు రైతులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులపై సాగుపోరు సన్నద్ధతపై సంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో శుక్రవారం హైదరాబాద్‌లో సమావేశమైన మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యేలు చింతా, సునీతారెడ్డి, మాణిక్యం, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కేసీఆర్ స్వప్నం సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతలు

సంగారెడ్డి జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు రూ.4,427 కోట్లతో సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలకు కేసీఆర్ శ్రీకారం చుట్టారు. రెండు పథకాల ద్వారా సంగారెడ్డి జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలను సింగూరు ప్రాజెక్టుకు తీసుకొచ్చి, అక్కడి నుంచి సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాల ద్వారా నారాయణఖేడ్, అందోలు, జహీరాబాద్, సంగారెడ్డి నియోజకవర్గాల్లో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని కేసీఆర్ సర్కార్ నిర్ణయించింది. 2022 ఫిబ్రవరి 20న నారాయణఖేడ్‌లో కేసీఆర్ సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపన చేశారు. రూ.2,653 కోట్ల వ్యయంతో సంగమేశ్వర ఎత్తిపోతల పథకం పనులు కేసీఆర్ సర్కార్ శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద జహీరాబాద్, అందోలు, సంగారెడ్డి నియోజకవర్గాల్లోని 11 మండలాల పరిధిలో ఉన్న 231 గ్రామాల్లోని 2.19 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది లక్ష్యం. నారాయణఖేడ్, అందోలు నియోజవర్గాల్లో 1.81 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా కేసీఆర్ సర్కార్ రూ.1,774 కోట్లతో బసవేశ్వర ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను నిలిపివేసింది. దీనిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇటీవల పోరుబాటకు పిలుపు ఇవ్వడంతో కాంగ్రెస్ సర్కార్ దిగివచ్చి తిరిగి పనులు ప్రారంభించింది.

యువత రాజకీయాల్లోకి రావాలి

- దీర్ఘకాలిక లక్ష్యాలు ఎంచుకోవాలి
- ప్రజాప్రతినిధులకు హాలీడేస్ ఉండవు
- ఎన్నారైలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పిస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్ తీరుతో పక్క రాష్ర్టాలకు పెట్టుబడులు
- 'తెలుగు ఎన్నారై రేడియో'తో హరీశ్‌రావు స్పెషల్ చిట్‌చాట్

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): దీర్ఘకాలిక లక్ష్యాలతో యువత రాజకీయాల్లోకి రావాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టీ హరీశ్‌రావు సూచించారు. విద్యావంతులు సైతం రాజకీయాల్లో వస్తున్నారని, ఇది స్వాగతించాల్సిన విషయమని అన్నారు. ఎన్నికలప్పుడే కష్టపడితే రాజకీయాల్లో రాణించలేమని చెప్పారు. ప్రజాప్రతినిధులకు హాలీడేస్ ఉండవని, నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటేనే ప్రజలు ఆదరిస్తారని అన్నారు. ఇదే తన సక్సెస్ మంత్ర అని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఎన్నారైలకు రానున్న రోజుల్లో చట్టసభల్లో బీఆర్ఎస్ తరఫున ప్రాతినిధ్యం కల్పిస్తామని చెప్పారు. హైదరాబాద్‌లో శనివారం 'తెలుగు ఎన్నారై రేడియో'తో హరీశ్ స్పెషల్ చిట్‌చాట్‌లో పాల్గొన్నారు. రాజకీయాల్లో పదవులతో వ్యక్తిత్వం పెరగదని ఆయన అభిప్రాయపడ్డారు. చేసిన అభివృద్ధి పనులతోపాటు మన ప్రవర్తన, ప్రజలతో నడుచుకొనే విధానం గుర్తింపు తెస్తుందని చెప్పారు. తొలి టర్మ్‌లో తమ ప్రభుత్వంలో తాగు, సాగునీటిపై ప్రధానంగా ఫోకస్ చేసినట్టు తెలిపారు. తద్వారా రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలను గణనీయంగా తగ్గించగలిగామని పేర్కొన్నారు. రెండో టర్మ్‌లో విద్య, వైద్యంపై ప్రధానంగా దృష్టి సారించినట్టు చెప్పారు. కొవిడ్ కారణంగా ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదురైనా ప్రజా సంక్షేమంలో ఎక్కడా వెనుకడుగు వేయలేదని అన్నారు.

కాంగ్రెస్ అడ్డగోలు హామీలు

ఎన్నికల్లో గెలవాలని కాంగ్రెస్ అడ్డగోలుగా హామీలు ఇచ్చిందని, ఆ హామీలను ప్రాక్టికల్‌గా అమలు చేసే పరిస్థితి లేదని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఆదాయ వనరులు పెంచుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వైఖరితో రాష్ర్టానికి రావాల్సిన పెట్టుబడులు ఇతర రాష్ర్టాలకు తరలి వెళ్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హైడ్రా కూల్చివేతలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిన్నదని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో పెట్టుబడులకు హైదరాబాద్ హబ్‌గా ఉన్నదని గుర్తుచేశారు. అనేకమంది నార్త్ ఇండియాకు చెందిన వ్యాపారులు గతంలో ఇక్కడ రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెట్టేవారని తెలిపారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో ఉంటూ రాష్ట్రం దివాలా తీసిందని ప్రకటించడంతో వాతావరణం మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రూ.40 వేల నుంచి 50 వేల కోట్ల పెట్టుబడులు పక్క రాష్ర్టాలకు తరలిపోయాయని తెలిపారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక రాష్ట్ర వృద్ధి రేటు -4శాతానికి పడిపోయిందని విమర్శించారు.

పనుల్లో అలసత్వం వహిస్తే సహించం

- ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్
- అధికారులతో ప్రాజెక్టులపై సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి15 (నమస్తే తెలంగాణ): ప్రాజెక్టుల పనుల్లో అలసత్వం వహించవద్దని, క్షేత్రస్థాయిలో పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సాగునీటిపారుదల శాఖ ఉన్నతాధికారులను ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఎస్ఎల్‌బీసీ, డిండి, పాలమూరు- రంగారెడ్డి తదితర ప్రాజెక్టుల పురోగతి.. రాజస్థాన్‌లో 18, 19 తేదీల్లో నిర్వహించనున్న అఖిల భారత నీటిపారుదల మంత్రుల సదస్సుకు సంబంధించిన అంశాలను జలసౌధలో శనివారం ఆయన సమీక్షించారు. ప్రాజెక్టు వివరాలు, క్షేత్రస్థాయి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. పనుల్లో ఆలస్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. జాతీయ సదస్సుకు సంబంధించి నీటిపారుదల రంగంలో రాష్ట్రం తీసుకొచ్చిన సంస్కరణలు, డిజిటల్ మానిటరింగ్‌తోపాటు నీటి నిర్వహణపై అనుసరిస్తున్న ఆధునిక విధానాలు, మైక్రో ఇరిగేషన్, పూడికతీత తదితర అంశాలపై సమగ్ర నివేదిక రూపొందించాలని ఆదేశించారు. పెండింగ్ ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడం ద్వారా అదనంగా 30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ముందుకుపోతున్నామని వివరించారు. సమావేశంలో నీటిపారుదల ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్య నాథ్ దాస్, ఈఎన్సీ అనిల్‌కుమార్, సీఈలు కే శ్రీనివాస్, అజయ్‌కుమార్, రమేష్‌బాబు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఆట

శ్రేయాంక స్థానంలో స్నేహ్‌రానా

బెంగళూరు: గాయం కారణంగా వుమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) సీజన్‌కు పూర్తిగా దూరమైన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ స్థానంలో స్నేహ్‌రానా జట్టులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని శనివారం ఆర్‌సీబీ ఒక ప్రకటనలో పేర్కొంది. 30 లక్షల ధరతో స్నేహ్‌రానా..ప్రస్తుత సీజన్‌లో ఆర్‌సీబీకి ఆడనుంది. గాయం కారణంగా ఇటీవల స్వదేశంలో వెస్టిండీస్, ఐర్లాండ్‌తో పా టు తాజాగా డబ్ల్యూపీఎల్‌కు శ్రే యాంక పూర్తిగా దూరమైంది. డిఫెండింగ్ చాంపియన్ ఆర్‌సీబీ..తమ తొలి మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ అద్భుత విజయంతో బోణీ కొట్టిన సంగతి తెలిసిందే.

ఢిల్లీ ధమాకా

ముంబైపై ఉత్కంఠ విజయం • మెరిసిన షెఫాలీ, నికి ప్రసాద్
స్కీవర్ అర్ధసెంచరీ వృథా • మహిళల ప్రీమియర్ లీగ్

మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో మరో పోరు అభిమానులను కట్టిపడేసింది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ జెయింట్స్ రికార్డు చేజింగ్ మ్యాచ్ మరువక ముందే ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్ పోరు పతాక స్థాయికి తీసుకెళ్లింది. ఆఖరి బంతి వరకు విజయం దోబూచులాడిన మ్యాచ్‌లో ముంబైపై ఢిల్లీనే విజయం వరించింది. నిర్దేశిత లక్ష్యఛేదనలో షెఫాలీవర్మ, నికిత ప్రసాద్ మెరుపులతో ఢిల్లీ లీగ్‌లో అదిరిపోయే బోణీ కొట్టింది. నాట్ స్కీవర్ అజేయ అర్ధసెంచరీతో పోరాడే స్కోరు అందుకున్న ముంబై..ఢిల్లీపై విజయాన్ని అందుకోలేకపోయింది.

వడోదరా: డబ్ల్యూపీఎల్..ఐపీఎల్‌కు ఏమాత్రం తీసిపోవడం లేదు. ఉత్కంఠను మరో స్థాయికి తీసుకెళుతూ అభిమానులను అలరించిన తీరు నభూతో నభవిష్యత్ అని చెప్పాలి. గెలుపు కోసం ఇరు జట్లు తలపడిన తీరు అందరినీ ఆకట్టుకుంది. శనివారం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ 2 వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్‌పై అద్భుత విజయం సాధించింది. ఆర్‌సీబీ, గుజరాత్ మ్యాచ్‌కు కొనసాగింపుగా ఢిల్లీ, ముంబై పోరు ఫ్యాన్స్‌ను ఊపేసింది. ముంబై నిర్దేశించిన 165 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ 8 వికెట్లు కోల్పోయి ఆఖరి బంతికి విజయాన్నందుకుంది. షెఫాలీవర్మ(43), అరంగేట్రం ప్లేయర్ నికి ప్రసాద్(35) రాణించగా, అరుంధతిరెడ్డి చివరి బంతికి జట్టుకు చిరస్మరణీయ విజయాన్నందించింది. మాథ్యూస్(2/32), అమెలియా కెర్(2/21) రెండేసి వికెట్లు తీశారు. తొలుత ముంబై..నాట్ స్కీవర్(59 బంతుల్లో 80 నాటౌట్, 13ఫోర్లు) అజేయ అర్ధసెంచరీతో 19.1 ఓవర్లలో 164 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్(42) ఆకట్టుకుంది. సదర్లాండ్(3/34), శిఖా పాండే(2/14) రాణించారు. నికికి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ దక్కింది.

సూపర్ నికి:

నిర్దేశిత లక్ష్యఛేదనలో ఢిల్లీకి అదిరిపోయే ఆరంభం లభించింది. డాషింగ్ ఓపెనర్ షెఫాలీ వర్మ ఆది నుంచే ముంబై బౌలర్లను లక్ష్యంగా చేసుకుంటూ విరుచుకుపడింది. ఇషాకి వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్‌లో షెఫాలీ 6, 4, 4,4, 4తో ఏకంగా 22 పరుగులు పిండుకుంది. షెఫాలీకి కెప్టెన్ మెగ్‌లానింగ్ చక్కని సహకారం అందించింది. ఓవైపు షెఫాలీ చెలరేగుతుంటే మరో ఎండ్‌లో లానింగ్ చక్కని సమన్వయంతో ముందుకు సాగింది. మాథ్యూస్ వేసిన ఆరో ఓవర్‌లో షెఫాలీ రెండు ఫోర్లు, సిక్స్‌తో దూకుడుమీదన్న స్థితిలో కౌర్‌కు ఇచ్చి తొలి వికెట్‌గా వెనుదిరిగింది. దీంతో పవర్‌ప్లే ముగిసే సరికి ఢిల్లీ వికెట్ నష్టానికి 60 పరుగులు చేసింది. ఆ తర్వాత లానింగ్(15), రోడ్రిగ్స్(2), సదర్లాండ్(13) వెంటవెంటనే ఔటయ్యారు. దీంతో ఢిల్లీ పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. ఈ తరుణంలో అలీస్ క్యాప్సె(16), నికి ప్రసాద్ జట్టును గాడిలో పడేశారు. వీరిద్దరు ముంబై బౌలింగ్‌ను దీటుగా ఎదుర్కొంటూ లక్ష్యం వైపు సాగారు. ముఖ్యంగా డబ్ల్యూపీఎల్ అరంగేట్రం మ్యాచ్‌లోనే నికి అద్భుత పరిణతి కనబరిచింది. సాఫీగా సాగుతున్న క్రమంలో క్యాప్సె ఔట్ కావడంతో ఢిల్లీ మళ్లీ ఇబ్బందుల్లో పడింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన సారా బ్రైస్(21)..నికికి జతకలిసింది. స్కీవర్ 17వ ఓవర్‌లో బ్రైస్ ఓ ఫోర్, సిక్స్‌తో అలరించింది. అయితే 7 పరుగుల తేడాతో బ్రైస్‌తో పాటు పాండే(2) ఔట్ కావడంతో ముంబై పోటీలోకి వచ్చింది. ఓవైపు సహచరులు వరుసగా నిష్క్రమిస్తున్నా..నికీ వెనుకకు తగ్గలేదు. చివరి ఓవర్‌లో విజయానికి 10 పరుగులు అవసరమైన దశలో తొలి బంతినే నికీ ఫోర్‌గా మలిచింది. ఆ తర్వాత 2, 1 పరుగులు చేసిన నికీ ఐదో బంతికి ఔటైంది. దీంతో సమీకరణం కాస్తా ఒక బంతికి 2 పరుగులుగా మారింది. క్రీజులో ఉన్న అరుంధతి అద్భుతమైన డైవింగ్‌తో జట్టుకు విజయాన్నందించింది.

సంక్షిప్త స్కోర్లు:
ముంబై : 19.1 ఓవర్లలో 164 ఆలౌట్(స్కీవర్ 80 నాటౌట్, హర్మన్‌ప్రీత్ 42, సదర్లాండ్ 3/34, పాండే 2/14), ఢిల్లీ: 20 ఓవర్లలో 165/8(షెఫాలీ 43, నికీ ప్రసాద్ 35, కెర్ 2/21, మాథ్యూస్ 2/32)

కేకేఆర్ X ఆర్‌సీబీ

మార్చి 22న కోల్‌కతాలో ఐపీఎల్ తొలి మ్యాచ్!

న్యూఢిల్లీ: ఐపీఎల్ 2025 సీజన్‌కు రంగం పూర్తిగా సిద్ధమైంది. పాకిస్థాన్, దుబాయ్ వేదికలుగా చాంపియన్స్ ట్రోఫీ ముగిడయమే ఆలస్యం ఐపీఎల్ రానే వస్తున్నది. ఈసారి డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) మధ్య ఈడెన్‌గార్డెన్స్‌లో మార్చి22న జరిగే అవకాశముంది. దీనికి తోడు మే 25న కోల్‌కతాలోనే ఫైనల్ పోరు జరుగనుంది. గత సీజన్ రన్నరప్ సన్‌రైజర్స్ హైదరాబాద్ మార్చి 23న తమ తొలి పోరులో రాజస్థాన్ రాయల్స్‌ను ఢీకొననుంది. అదే రోజు రాత్రి మాజీ చాంపియన్లు చెన్నై సూపర్‌కింగ్, ముంబై ఇండియన్స్ మధ్య పోరు జరుగనుంది. ఈసీజన్‌లో 10 జట్లు 12వేదికల్లో తలపడనున్నాయి. నిరుడు లాగే ఈసారి పంజాబ్, రాజస్థాన్..ధర్మశాల, గువాహటిలో మ్యాచ్‌లు ఆడనునున్నాయి. ఆర్‌సీబీ..రజత్ పటీదార్ నేతృత్వంలో బరిలోకి దిగనుండగా, పంజాబ్‌కింగ్స్‌కు శ్రేయాస్ అయ్యర్ నాయకత్వం వహించనున్నాడు.

సిన్నర్‌పై నిషేధం

డోపింగ్‌లో చిక్కుకున్న వరల్డ్ నంబర్‌వన్

లండన్: ప్రపంచ నంబర్‌వన్, ఇటలీ టెన్నిస్ స్టార్ జానిక్ సిన్నర్‌పై మూడు నెలల నిషేధం పడింది. నిషేధిత ఉత్ప్రేరకాలు తీసుకున్న కారణంగా అంతర్జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ(వాడా) సిన్నర్‌పై మూడు నెలల పాటు నిషేధం విధిస్తూ శనివారం నిర్ణయం తీసుకుంది. వాస్తవానికి ఏడాది పాటు నిషేధం విధించాల్సి ఉన్నా ..తాను ఉద్దేశపూర్వకంగా తీసుకోలేదన్న సిన్నర్ వాడా నిర్ణయాన్ని ఇంటర్నేషనల్ టెన్నిస్ ఇంటిగ్రిటీ ఏజెన్సీ(ఐటీఐఏ)లో సవాల్ చేశాడు. దీంతో సిన్నర్ వాదనతో ఏకభవించిన ఐటీఐఏ..అతనిపై చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. ఈ క్రమంలో ఐటీఐఏ నిర్ణయాన్ని సవాలు చేస్తూ స్విట్జర్లాండ్‌లోని కోర్ట్ ఆఫ్ అర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్‌లో సవాలు చేసిన వాడా పిటీషన్ వాపస్ తీసుకుంది. ఇందులో భాగంగా మూడు నెలల పాటు సస్పెన్షన్‌కు సిన్నర్‌కు అంగీకారం తెలపడంతో వాడా ఈ నిర్ణయానికి వచ్చింది.

బెన్ డకెట్ ఫిట్

లండన్: ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీకి ముందుకు ఇంగ్లండ్‌కు శుభవార్త. ఇటీవల అహ్మదాబాద్‌లో టీమ్‌ఇండియాతో ఆఖరిదైన మూడో మ్యాచ్‌లో గాయపడ్డ ఇంగ్లండ్ ఓపెనర్ బెన్ డకెట్ పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. ఈ విషయాన్ని ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు(ఈసీబీ) శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. భారత్‌తో మూడో వన్డేలో ఫీల్డింగ్ చేస్తుండగా డకెట్ గాయపడ్డాడు. ఆ తర్వాత జరిపిన స్కానింగ్ పరీక్షల్లో గాయం తీవ్రత అంతగా లేదని తేలడంతో ఈసీబీ మేనేజ్‌మెంట్ ఊపిరి పీల్చుకుంది. టీమ్‌ఇండియా చేతిలో 0-3తో వైట్‌వాష్ ఎదుర్కొన్న ఇంగ్లండ్.. చాంపియన్స్ ట్రోఫీ కోసం ఈనెల 18న పాకిస్థాన్‌కు చేరుకోనుంది. తమ తొలి మ్యాచ్‌లో ఈనెల 22న లాహోర్‌లో ఆస్ట్రేలియాను ఎదుర్కొనుంది.

గుల్వీర్‌సింగ్ నయా రికార్డు

న్యూఢిల్లీ: హాంగ్జౌ(చైనా) ఆసియా గేమ్స్ కాంస్య పతక విజేత గుల్వీర్‌సింగ్ నయా రికార్డు నెలకొల్పాడు. బోస్టన్ వేదికగా జరిగిన బీయూ డేవిడ్ హెమ్రై వాలెంటైన్ ఇన్విటేషనల్ టోర్నీలో గుల్వీర్ సరికొత్త జాతీయ రికార్డు నెలకొల్పాడు. పురుషుల 3000మీటర్ల ఇండోర్ రేసును గుల్వీర్ 7:38:26సెకన్లలో ముగించి 16 ఏండ్ల క్రితం సురేందర్ సింగ్(7:49:47సె) రికార్డును తిరుగరాశాడు. చివరివరకు ఆసక్తికరంగా సాగిన రేసులో గుల్వీర్ రెండో స్థానంతో ముగించాడు. బోస్టన్ రాణించడం ద్వారా ఈ ఏడాది జరుగనున్న ప్రపంచ అథ్లెటిక్స్ టోర్నీకి నేరుగా అర్హత సాధించే అవకాశం లభించనుంది. ఇదిలా ఉంటే త్వరలో జరుగనున్న ఆసియా, ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ కోసం స్కాట్ సిమన్స్ నేతృత్వంలో భారత అథ్లెట్లు శిక్షణ పొందుతున్నారు.

దుబాయ్‌కు టీమ్‌ఇండియా

ముంబై: చాంపియన్స్ ట్రోఫీ కోసం టీమ్‌ఇండియా శనివారం దుబాయ్‌కి బయల్దేరి వెళ్లింది. ఛత్రపతి శివాజీ విమానాశ్రయంలో టీమ్‌ఇండియా క్రికెటర్లకు అభిమానులు వీడ్కోలు పలికారు. కెప్టెన్ రోహిత్‌శర్మ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోగానే ఫ్యాన్స్ ఒక్కసారిగా అరుపులు, కేకలతో గోల చేశారు. స్టార్ క్రికెటర్ విరాట్‌కోహ్లీ, శుభ్‌మన్ గిల్, చీఫ్ కోచ్ గౌతం గంభీర్‌తో సహా క్రికెటర్లందరూ ఫ్యాన్స్‌కు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. చాంపియన్స్ ట్రోఫీలో తమ తొలి మ్యాచ్‌లో బంగ్లాతో తలపడనుంది.

భారత్‌దే గెలుపు

మహిళల ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్

భువనేశ్వర్: స్వదేశం వేదికగా జరుగుతున్న ఎఫ్ఐహెచ్ ప్రొలీగ్‌లో భారత మహిళ హాకీ జట్టు అదిరిపోయే విజయంతో ఆకట్టుకుంది. శనివారం ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 3-2తో ఇంగ్లండ్‌పై అద్భుత విజయం సాధించింది. తమ(9) కంటే మెరుగైన ర్యాంక్‌లో ఉన్న ఇంగ్లండ్(7)ను భారత్ మెరుగ్గా నిలువరించింది. వైష్ణవి ఫాల్కె(6ని), దీపిక(25ని) పెనాల్టీ కార్నర్ గోల్స్ చేయగా, మ్యాచ్ ఆఖరి నిమిషంలో నవనీత్‌కౌర్(59ని) గోల్‌తో భారత్ విజయం ఖరారైంది. డార్కీ బౌర్నె(12ని), ఫియోనా క్రాకల్స్(58ని) ఇంగ్లండ్‌కు గోల్స్ అందించారు.

పురుషుల జట్టుకు పరాజయం

ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్‌లో ఓవైపు అమ్మాయిలు అదరగొడుతుంటే..అబ్బాయిలు పేలవ ప్రదర్శన కనబరిచారు. శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 1-3 తేడాతో స్పెయిన్ చేతిలో ఓటమిపాలైంది.